క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం పెద్ద ముత్తేవిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ కే మస్తాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రం ద్వారా సచివాలయ పరిధిలోని పెదముత్తేవి, కొండవరం ఆయకట్టులోని ధాన్యాన్ని కొనుగోలు చేస్తారన్నారు. ఈ కేంద్రానికి గోనె సంచులను శనివారం సాయంత్రం లోపు అందజేస్తామని సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ చెప్పారని పేర్కొన్నారు. ఆర్ఐ విజయదుర్గ, వీఏఏ మురారి అంజలి, వీఆర్వో తిరుమలరావు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

గుడివాడరూరల్: చర్చికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన భార్య కన్పించడం లేదని ఆమె భర్త స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. గుడివాడ తాలూకా పోలీసుల కథనం మేరకు మండలంలోని మల్లాయపాలెం గ్రామ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన మల్లాల వెంకటేశ్వరరావు భార్య జ్యోతి ఈనెల 15వ తేదీన చర్చికి వెళ్తున్నానని భర్తకు చెప్పి వెళ్లింది. సాయంత్రం అయినా జ్యోతి ఇంటికి రాకపోవడంతో ఆమె ఆచూకీకోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూదరులపై కేసు

మండవల్లి: మండలంలోని భైరవపట్నం శివారులో జూదం ఆడుతున్న వ్యక్తులపై ఎస్ఐ రామచంద్రరావు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని భైరవపట్నంలో 21వ తేదీ రాత్రి 11 గంటలకు కోగంటి విజయ్ చెరువు వద్ద అతని ఆధ్వర్యంలో 10మంది కోతాట ఆడుతున్నారు. ఎస్ఐ వారిని అరెస్టు చేసి, వారినుంచి రూ.1.13 లక్షల నగదు, పేకముక్కలను స్వాధీనంచేసుకుని కేసు నమోదు చేశారు.

రేపు రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ వన సమారాధన

పామర్రు: పామర్రు మండల రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన సత్య నారాయణ స్వామి వ్రతం, కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మా రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, భీమవరపు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక యలమర్రురోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధి కారి బొందు సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు

గుడివాడరూరల్: బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు తప్పవని గుడివాడ వన్ టౌన్ ఎస్ఐ పి.గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక బేతవోలు ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థినుల వ్యక్తిగత భద్రత, జాగ్రత్తలపై శక్తి టీం పోలీసులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. గుడివాడ పరిసర ప్రాంతాల్లో ఈవ్ టీజింగ్ నివారించేందుకు శక్తిటీంలు ఏర్పాటు చేసి ప్రత్యేక మహిళా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. బాలికలు, మహిళలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ శిరీష, నాగమణి, శక్తి కానిస్టేబుల్ సురేంద్ర పాల్గొన్నారు.

అన్నదానం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో శుక్రవారం పేదలకు అన్నదానకార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్య క్రమాన్ని డాక్టర్ నర్రా గంగాధరరావు(వెస్టిండీస్) ఆ ర్థికసాయంతో నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మ గడ్డ శశికళ తెలిపారు. లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై. పి.సి. ప్రసాద్, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



గుడివాడ టౌన్: వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావుతో కలిసి మార్కెట్ సెంటర్, బంటుమిల్లి రోడ్, కోతిబొమ్మ సెంటర్, ఏలూరు రోడ్ తదితర ప్రాంతాల షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు వాడుతున్న వ్యాపారులకు రూ.1,500 జరిమానా విధించారు. తొలి హెచ్చరికగా కొద్ది మొత్తంలో జరిమానా విధిస్తున్నామని మరోసారి ఇదేవిధానాన్ని కొనసాగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. ప్లాస్టిక్ సంచులు డ్రెయిన్‌లలో వేసినా వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అన్నదాత గోడు పట్టదా..!



నా పేరు కలకోటి శ్రీనివాసరెడ్డి పామర్రు గ్రామం. నేను 20 ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరానికి 40 బస్తాల వరకు పండింది. ప్రస్తుతం 15 ఎకరాల్లో వరి పంటను మిషన్ ద్వారా నూర్పించా. ధాన్యం నమూనాలను రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్లా. వారు ధాన్యం సేకరించేందుకు మా వద్ద జీపీఎస్ వాహనాలు, గన్నీ బ్యాగ్‌లు లేవు.. మీకు దగ్గరలో ఉన్న మిల్లర్ పేరు చెప్పండి.. మేము సమాచారం ఇచ్చి కొనుగోలు చేస్తామన్నారు. దీంతో దగ్గరలోని ఓ మిల్లర్ దగ్గరకు వెళ్తే ప్రభుత్వం సాధారణ ధాన్యం 75 కేజీల ధర రూ.1,725 ఉండగా మిల్లరు వాటిని రూ.1,400కు అయితే కొనుగోలు చేస్తామని చెప్పారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, మంచి క్వాలిటీ కాదనే నెపంతో తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. చేసేది లేక బస్తా రూ.1,400కే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ మద్దతు ధరకు అమ్మితే 15 ఎకరాల్లోని 600 బస్తాలకు మొత్తం రూ.10.35 లక్షలు వచ్చేవి, అయితే బస్తాను రూ.1,400లకే విక్రయించడంతో రూ.8.40 లక్షలు మాత్రమే వచ్చాయి. దీని వలన నాకు రూ.1.95 లక్షల నష్టం ఏర్పడింది. అధికారులు దృష్టి సారించి రైతులకు తగు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.



ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

- మిల్లర్ల చేతికే ధాన్యం కొనుగోలు అవకాశం
- ఆందోళనలో అన్నదాతలు

పామర్రు: ధాన్యం కొనుగోలులో మిల్లర్లు, దళారుల హవా నడుస్తోంది. మిల్లర్లు వారికి ఇష్టం వచ్చిన రీతిలో ధాన్యం రేటు నిర్ణయించి రైతులకు చెబుతున్నారు. చేసేది లేక రైతులు తమ ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు. ఒకొక్క రైతు తాను సాగు చేసిన ఎకరాలను అనుసరించి రూ.వేలు, రూ.లక్షల్లో నష్టపోతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎక్కడా కూడా జీపీఎస్ వాహనాలు, గన్నీ బ్యాగ్‌లు లేవు. మాయిశ్చరైజింగ్ జరుగుతున్న దాఖలాలు లేవు. కేంద్రాల వద్దకు వచ్చే రైతులను అక్కడి సిబ్బంది దగ్గరలో ఉన్న మిల్లర్ల వద్దకు పంపుతున్నారు. దీంతో అన్నదాతలు నష్టపోతున్నారు.

తేమ శాతంతో మోసం

స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఉన్న తేమ శాతం మిషన్‌లో ఒక రకంగా ఉంటోంది. అదే మిల్లర్ వద్ద ఉన్న మిషన్‌లో మరొక రకంగా మారుతోంది. దీంతో తమనకు నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. మిషన్ ద్వారా నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు మిల్లర్ల దగ్గరకు తీసుకెళ్తే తేమ శాతం ఎక్కువగా ఉందని బస్తాకు రూ.325 నుంచి రూ.400 వరకు మినహాయించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు నష్ట పోతున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన మిల్లరు కొంత మంది అధికారుల సహకారంతో ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరకే అమ్మకాలు జరిపి రూ.లక్షల్లో లాభాలను గడిస్తున్నాడు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పామర్రు మండల టార్గెట్ 36,430 మెట్రిక్ టన్నులు కాగా 15 రైతు సేవా కేంద్రాల్లో ఇప్పటి వరకు 593 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించినట్లు అధికారులు చెబుతున్నారు.

తేమ శాతంతో ఇబ్బందులు



తేమ శాతంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో వచ్చిన తేమ శాతానికి మిల్లర్లు తీసిన తేమ శాతానికి చాలా వ్యత్యాసం ఉంటోంది. దీని వలన రైతులు ఎక్కువగా నష్ట పోతున్నారు.

– మర్రెడ్డి అంజిరెడ్డి, రైతు, పామర్రు

ప్రభుత్వం స్పందించాలి



రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. మిల్లర్ల దోపిడీని అరికట్టే విధంగా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

– నాగరాజు, రైతు

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వద్దు

గుడ్లవల్లేరు: రైతులు ఆరుగాలం పండించిన పంటకు అమ్ముకునే సమయానికి ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వహిస్తే సహించేది లేదని తహసీల్దార్ బి.లోకరాజు రైతు సేవాకేంద్రాల్లోని కొనుగోలు సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం ఆయన గుడ్లవల్లేరు, కౌతవరం ఆర్ఎస్కేల్లోని ధాన్యం కొనుగోలు ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆయన వెంట ఆర్ఐ పి.శివకుమార్, వీఆర్వో శాయన ప్రకాష్ ఉన్నారు.

వాతావరణం మార్పుతో కొనుగోళ్లు వేగవంతం

గుడ్లవల్లేరు: అల్ప పీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని తుపాను వస్తుందనే ప్రచారం ఊపందుకోవటంతో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నామని తహసీల్దార్ బి.లోకరాజు తెలిపారు. శుక్రవారం గుడ్లవల్లేరు మండలంలోని అన్ని రైస్ మిల్లులను సందర్శించి అక్కడ రైతులకు కావాల్సిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రైతుల ధాన్యం రవాణా ఎగుమతులకు అవసరమైన గోనె సంచులను వెంటనే అందించే విధంగా ఏర్పాట్లను చేయాలని ఆయా రైస్ మిల్లుల యజమానులతో ఆయన మాట్లాడారు.

రాజీమార్గంలో కేసుల పరిష్కారంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్: రాజీమార్గంలో కేసులు పరిష్కార దిశగా కక్షిదారులలో అవగాహన పెంచాలని 11వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేధికార కమిటీ చైర్మన్ జి. సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక కోర్టు హాల్లో కోర్టు పరిధిలోని పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీల మేనేజర్లు, న్యాయవాదులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 12వ తేదీ నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. చట్టబద్ధంగా రాజీ మార్గంలో పరిష్కారం అయ్యే కేసులను గుర్తించి కక్షిదారులకు వివరించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా అధికారులు కృషి చేయాలని న్యాయవాదులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సుధారాణి, మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి.గాయత్రి, పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుపై నిరసన



నిరసన తెలుపుతున్న భవిష్యత్ భద్రతాదళం సభ్యులు

గుడివాడ టౌన్: సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పట్టణంలో పురపాలక సంఘ అధికారులు గౌరవించడం లేదని భవిష్యత్ భద్రతాదళం కన్వీనర్ వైవీ మురళీ కృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్, ఇతర ప్రాంతాల్లో భద్రతాదళం సభ్యులతో కలిసి నల్లజెండాలతో ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఎక్కడా ఏర్పాటు చెయ్యకూడదని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలను ఇస్తే వాటిని అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇదే విధానం కొనసాగిస్తే అధికారులపై కోర్టు ధిక్కారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

17 మద్యం బాటిళ్ల స్వాధీనం

గుడివాడరూరల్: వేర్వేరు ప్రాంతాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, 17 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ గుడివాడ మండలం బిళ్లపాడు గ్రామానికి చెందిన తాడి భారతీరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో సిబ్బంది దాడి చేసి అదుపులోకి తీసుకుని అతడి వద్ద తొమ్మిది మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. పామర్రు మండలం కనుమూరులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వై.వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని ఎనిమిది మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కైకలూరులో 32 బాటిళ్లు..

కైకలూరు: బెల్టు దుకాణాలపై ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు, స్థానిక ఎక్సైజ్ అధికారులు నియోజకవర్గం నాలుగు మండలాల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కలిదిండి మండలం కలిదిండి, కైకలూరు మండలం వింజరం, మండవల్లి మండలం పులపర్రు గ్రామాల్లో బొద్దుల నాగబాబు, జడ్డు సుబ్రహ్మణ్యం, ఘంటసాల నాగలక్ష్మి నుంచి 32 అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా కైకలూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద సీఐ రమేష్ మాట్లాడుతూ బెల్టు షాపుల సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆదినారాయణ, అలీం పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్లు



గుంతలమయంగా మారిన అయ్యవారిరుద్రవరం-మండవల్లి రోడ్డు



పెనుమాకలంకలో అధ్వానంగా మారిన రోడ్డు

మండవల్లి: మండవల్లి–అయ్యవారిరుద్రవరం వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. వర్షం పడిందంటే రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షం నీరు నిలవడంతో వాహనచోదకులకు నరకం కనిపిస్తోంది. ఈ గ్రామం మండవల్లికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. విద్యార్థులు ఇక్కడి నుంచి మండవల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చి గుడివాడ, భీమవరం, విజయవాడ పట్టణాలకు వెళతారు. ఈ రహదారిని అభివృద్ధి చేసి సమస్యలు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా మండవల్లి–పెనుమాకలంక రోడ్డు

మండల్లి–పెనుమాకలంక రోడ్డు అధ్వానంగా ఉందని ఈ రోడ్డుకు మోక్షమెప్పుడోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండవల్లి నుంచి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంటుంది. కొల్లేటి లంక గ్రామాల్లో ఇది అతి కీలకమైన గ్రామం. ఇప్పటికైనా ఈ రహదారులను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణం నరకప్రాయం



మండవల్లి–అయ్యవారిరుద్రవరం రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. దీనిపై ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా ఉంది. రహదారిని వెంటనే అభివృద్ధి చేయాలి.

–పసుపులేటి నాంచారయ్య, మండవల్లి

రహదారి అధ్వానం



మండల్లి–పెనుమాకలంక రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. ఈ గ్రామం కొల్లేటి లంక గ్రామాల్లో కీలకమైనది. కూటమి ప్రభుత్వం కనీసం రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

–అర్జా రవి, మండవల్లి

మాతృత్వం ఒక వరం

పమిడిముక్కల: మాతృత్వం ఒక వరం–దత్తత దానికి మరో మార్గమని జిల్లా బాలల సంరక్షణా విభాగం అధికారి ప్రశాంతి పేర్కొన్నారు. చోరగుడి హైస్కూల్లో అంతర్జాతీయ దత్తత మాసం–నవంబర్ 2024 దత్తత, తాత్కాలిక దత్తతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్, బాలల సంరక్షణ విభాగం, వన్ స్టాప్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దత్తత, కిషోరి వికాసం, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ అధికారి మేరి, వన్ స్టాప్ సెంటర్ అధికారులు సుధ, సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

26న అడుసుమిల్లి జయంతి వేడుకలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు స్వర్గీయ అడుసుమిల్లి అశ్వర్థనారాయణమూర్తి జయంతి వేడుకలు పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 26వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యా సంస్థల సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పేద కుటుంబాల వారికి వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

పీఎంఏజేవైకి ఏడు గ్రామాల ఎంపిక

పామర్రు: మండలంలోని ఏడు గ్రామాలను పీఎంఏజేవై పథకం కింద ఎంపిక చేసినట్లు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2018–19 నుంచి 2021–22 సంవత్సరానికి సంబంధించి ఈ ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని నిభానుపూడి, కొమరవోలు, అడ్డాడ, ఐనంపూడి, పెదమద్దాలి, బల్లిపర్రు, రిమ్మనపూడి గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు సంబంధించి కావాల్సిన సీసీ రహదార్లు, సీసీ డ్రెయిన్లు ఎస్టిమేట్లు వేసి జిల్లా పరిషత్ మచిలీపట్నం వారికి పంపించాలని సీఈఓ ఆదేశించారని పేర్కొన్నారు. ఎంపీడీవో జ్యోతి, ఏపీఆర్ రామారావు పాల్గొన్నారు.

త్రివేణి విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఇటీవల జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి బహుమతులు సాధించినట్లు త్రివేణి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.శివశంకర్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విజేతలైన విద్యార్థులను యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, చెస్, దేశభక్తి గీతాలు, వక్తృత్వ, చిత్రలేఖనం, క్యారమ్స్, లఘునాటికలు, క్విజ్ తదితర పోటీల్లో మొత్తం 20 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు ఆయన తెలిపారు.

కార్తిక మాస పూజలు

మండవల్లి: లింగాల విశ్వేశ్వరస్వామి ఆలయంలో కొలువైన స్వామికి కార్తిక మాసం సందర్భంగా పంచామృతాలతో శుక్రవారం అభిషేకాలు, విశేష పూజలు శుక్రవారం చేశారు. మండవల్లిలో కొలువైన్న శ్రీ భ్రమరాంభ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గుడివాడరూరల్: స్వల్ప విషయమై జరిగిన ఘర్షణలో వ్యక్తిపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించాడని ఓ వ్యక్తి గుడివాడ తాలూకా పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు టిడ్కో సముదాయం వద్ద ఉన్న జగనన్న కాలనీలో నివాసముంటున్న వైకుంఠపు తిరుపతిరావుకు అదే ప్రాంతంలో ఉంటున్న సత్యానికి కుక్కల విషయమై గతంలో వివాదం జరిగింది. ఈ వివాదాన్ని మనసులో పెట్టుకున్న సత్యం ఈ నెల 21వ తేదీన తిరుపతిరావుతో గొడవపడ్డాడు. వివాదం ముదిరి.. సత్యం, అతని భార్య వెంకటరమణతో కలసి తిరుపతిరావుపై కత్తితో దాడి చేశారు. తిరుపతిరావు నుదిటిపై తీవ్ర గాయమైంది. చుట్టుపక్కల వారు వచ్చి అడ్డుకున్నారు. కుటుంబ సభ్యులు తిరుపతిరావును వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు మెగా ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్: గుడివాడ కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 24న మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నీలామహల్ రోడ్‌లోని కాపు కల్యాణ మండపంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజ యవాడకు చెందిన మణిపాల్ హాస్పిటల్ వైద్యబృందం వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులు దిశా నిర్దేశకులు



ఉత్తమ, విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పామర్రు: ఉపాధ్యాయులు విద్యార్థులకు దిశా నిర్దేశకులుగా ఉండాలని కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక అసీస్సీ హైస్కూల్ ఆవరణలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సన్మాక కార్యక్రమాల్లో భాగంగా 2024లో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు శుక్రవారం సన్మానం కార్యక్రమం నిర్వహించారు. సన్మానం అందుకున్న వారిలో విశ్రాంత స్కూల్ అసిస్టెంట్లు సీతారామయ్య, సీహెచ్ అరవపల్లి రావు, రామారావు, విశ్రాంత పీడీ ఆనంద్‌రెడ్డి, విశ్రాంత ఎస్జీటీ ప్రభావతి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యా అవార్డు గ్రహీత శివరామప్రసాద్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శాంతి అంకరవి ఉన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుసేన్, సహాధ్యక్షుడు నీలం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: వినియోగదారుల అనుమతులు లేకుండా పట్టణంలో యథేచ్ఛగా ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును గృహ వినియోగదారులు వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఆ విధానాన్ని ప్రజలు తిరస్కరించాలన్నారు. స్మార్ట్ మీటరు ధర రూ. 13 వేలు కాగా దానిని రూ. 30 వేలుగా నిర్ణయించి 92 నెలల్లో నెలవారీ పద్ధతిలో వినియోగదారుని నుంచి ఆ మొత్తాలను ప్రభుత్వం వసూలు చేస్తోందన్నారు. ఇది పెద్ద కుంభకోణం అన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ త్వరలోనే ఉద్యమం ప్రారంభిస్తామని మీటర్లు బిగించేటప్పుడు వినియోగదారులు అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు ఆర్.కొండ, ఎ. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి కొలతలు

గుడ్లవల్లేరు: జగనన్న, చంద్రన్న కాలనీల్లో నివశిస్తున్న దాదాపు 1,500 కుటుంబాల కల సాకారం కానుంది. ఈ కాలనీలకు అంబేడ్కర్ నగర్ మీదుగా చుట్టూ తిరిగి వచ్చే సీసీ రోడ్డు తప్ప...అధికారకంగా ఏ రహదారి లేకుండా పోయింది. ఆ రహదారి కోసం రైల్వేస్టేషన్‌ను ఆనుకుని నివాసాల మీదుగా 30 అడుగుల వెడల్పుతో రోడ్డును నిర్మించేందుకు శుక్రవారం తహసీల్దార్ బి.లోకరాజు తమ సిబ్బందితో కలిసి కొలతలు వేయించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి మాట్లాడుతూ రైల్వే శాఖ నుంచి కూడా అనుమతిని తీసుకుని రోడ్డును నిర్మించి ఇరు కాలనీల వాసుల కలను నెరవేర్చనున్నామని చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, ఆర్ఐ పి.శివకుమార్, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా, వీఆర్వో శాయన ప్రకాష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



రాచపట్నంలో డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కైకలూరు: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయవచ్చని కైకలూరు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీఎస్ఎస్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శీతనపల్లి పీహెచ్‌సీ పరిధి రాచపట్నంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, ఖాళీ డ్రమ్ముల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం, డ్రెయిన్లలో ప్లాస్టిక్ గ్లాసులు లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

25న గౌడ కార్తిక వనసమారాధన

మండవల్లి: కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన ఈ నెల 25న మండలంలోని శోభద్రిపురం అగ్రహారంలో శ్రీ భ్రమరాంభ సమేత చిన మల్లేశ్వరస్వామి శివాలయం వద్ద నిర్వహించనున్నట్లు వన సమారాధన కమిటీ చైర్మన్ పడమట గణేష్‌బాబు శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర గౌడ సంఘం నాయకులు పోసిన చెంచురామారావు, మాజీ ఎంపీ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.